



"హల్లో!"

"ఎస్!" తియ్యని ఆడకంఠపు జవాబు.

"ఈజిట్ డబుల్ త్రీ డబుల్ టూ డబుల్ వన్!" అడిగేను తడబాటుగా.

"ఎగ్జాక్ట్లీ."

"మే అయ్ స్పీక్ విత్ శ్రీకాంత్?"

"ఆయన వూళ్ళోలేరు. మీరెవరో తెలుసుకోవచ్చా?" ఆమె జవాబుకి నా గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్లయింది. నేనొస్తానని తెలిసి కూడా ఎక్కడికి వెళ్ళాడీ ఫూల్.

కోపాన్ని దిగమింగి "ఎప్పుడొస్తాడు?" అంటూ అడిగేను.



ఆమె చిన్నగా నవ్వి "మీ పేరు?" అంటూ ఎదురు ప్రశ్నించింది.

"ప్రకాష్!"

"స్వయం ప్రకాష్!" అంటూ ఆమె రెట్టించింది.

"ఎస్!" అన్నాను ఆశ్చర్యంగా.

తిరిగి మళ్ళీ చిన్నగా నవ్వు!

టెలిఫోన్ తీగెల్లో తేనెలు జాలువారుతోన్నట్లుగా.

"ఆయన చెప్పేరు మీరీరోజు వస్తారని! ఇనివిటబుల్‌గా ఏదో కాన్ఫరెన్సుకి అటెండ్ కావల్సివుంది. హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్ళేరు. ఈ పాటికి ఆయనజీప్ బయల్దేరే వుంటుంది! మరోగంట లేదా రెండు గంటలు. మీరు స్టేషన్ నుంచి మాట్లాడుతున్నారా?" ఆమె మెత్తగా అడిగింది,

"లేదు. హోటల్ రూంనుంచి!" అన్నాను నిరుత్సాహంగా.

"వ్వాట్?" ఆమె గొంతులో ఆశ్చర్యం.

నేను మాట్లాడలేదు.

"ఆయన మాటల్ని బట్టి మీరు ఆయనకి చాల క్లోజ్ ఫ్రెండని అర్థం చేసుకున్నాను. మాకోసమే ఈ వూరొచ్చి మీరు హోటల్ రూమ్‌లో దిగటం మాకు కాక పోయినా ....మీ స్నేహానికి మీరు చేసిన అవమానంగా భావిస్తున్నాను." అందామె సీరియస్‌గా.

"సీరియస్‌గా తీసుకోకండి. స్టేషన్‌కి రాకపోయేసరికి-మీరు వూళ్ళోలేరేమోనని ....హోటల్లో దిగేను!" అన్నాను నేను నవ్వుతూ.

"తప్పు మాదేనని ఒప్పుకుంటున్నాను. మీరా హోటల్ గది వెంటనే ఖాళీచేసేసి

"యింటికొచ్చేయండి." అందామె ఆజ్ఞాపిస్తున్నట్లు.

ఆమె మాట తీరు నాకు నవ్వు తెప్పిస్తోంది. నేనెవరో తెలియకుండా చనువుగా తమాషాగా మాట్లాడటం నాకు ఆశ్చర్యాన్నికూడా కల్గిస్తోంది.

"ఎందుకులెండి! ఎలాగూ ఒక రోజు రెంట్ పే చేసేసేను. శ్రీకాంత్ వచ్చేకనే వస్తాను!" అన్నాను.

అటునుంచి కాస్సేపు మౌనం.

"అదేం కుదరదు. ఆయన మీకోసం చెయ్యాల్సిన ఏర్పాట్లు చెప్పే వెళ్ళేరు. మీకు తెయిర్‌వడ యిష్టమని - పెసరట్లు ప్రాణమని - ఫిల్టర్ కాఫీని అమృతప్రాయంగా భావిస్తారని! తెయిర్‌వడ ఫ్రిజ్‌లో చల్లబడుతోంది. పెసరట్లు పెనం మీదకి ఎక్కడానికి సిద్ధంగావున్నాయి. భోజనంలోకి ఫిష్‌కట్‌లెట్స్ రడీచేయబోతున్నాను. చాలా రోజులు ట్రెయినింగ్‌లో వుండి వస్తోన్న మీరు వీటిని కాదని.... హోటల్లో భోంచేయడం.... రియల్లీ అయ్ పిటీయూ" అందామె నన్నుడికిస్తున్నట్లు.

నాకుకూడా ఆమె మాట్లాడే విధానం థ్రిల్లింగ్‌గా వుంది. ఆ ఫోన్ శ్రీకాంత్ యింటినుంచి కాకుంటే.... ఆ మాట్లాడేది మిసెస్ శ్రీకాంత్ కానట్టయితే ఎంతో ఎంజాయ్‌చేసివుండేవాడిని!

ఇంతకీ ఈమె ఎవరు?

పరిచయం చేసుకోనేలేదు!

"మీరెవరో చెప్పనేలేదు!" అన్నాను సందేహంగా. మళ్ళీ నవ్వుల జల్లు.

అలలు అలలుగా తేలి నా చెవుల్లో అమృతధారలు కురుస్తోన్న భావన!

"రామాయణం అంతా విని...." ఆమె నవ్వుతోంది తెరలుతెరలుగా.

"సారీ!" అన్నాను డెలికేట్‌గా.

"దజస్ట్ మేటర్! మీరు బయల్దేరుతున్నారుకదూ!" అందామె నవ్వటం ఆపి.

"తప్పదంటారా!" అన్నాను నిస్పహాయంగా.

"ఇప్పుడు సరిగ్గా ఎనిమిదిన్నర. మీరు ఏవిధంగా చూసినా తొమ్మిది గంటలకి - ఇక్కడ వుండాలి. నాకవతల వంటపని వుంది!" అంటూ నన్ను మరో మాట మాట్లాడనివ్వకుండా ఫోన్ పెట్టేసింది.

ఒక అపరిచిత వ్యక్తితో అంత చనువుగా. తమాషాగా మాట్లాడుతోన్న ఆమెని వెంటనేచూడాలనే ఆసక్తి-ఆమె శ్రీకాంత్ శ్రీమతన్న విషయం చంపేస్తోంది!



బజ్జర్‌నొక్కి వెయిటర్‌ని బిల్‌తెమ్మని సూట్‌కేస్ సర్దుకో సాగేను.

ఏపని చేస్తున్నా ఆమెనవ్వే నాచెవుల్లో ప్రతిధ్వనిస్తోంది!

శ్రీకాంత్‌కి ఇంత మాటకారి భార్య కావడం నాకు ఆశ్చర్యంగా. వాడు చాల నెమ్మది.... బుద్ధిగా చదువుకోటం మినహాయించి మరో విషయంలో జోక్యం చేసుకునే వాడుకాదు.

ఇద్దరం కలిసి విశాఖపట్టణంలోనే ఎమ్ ఎ." చేసేం.ఇద్దరంకలిసి ఐ ఏ.ఎస్‌కి ప్రిపేరయ్యి ఎంట్రన్స్‌కూడా రాసి పాసయ్యేం. అమితమైన ఉత్సాహంతో రిటెన్ ఎగ్జామ్స్‌కి ఎప్పియర్ అయ్యేం. రిటెన్‌లో నేను పాస్ కావడం శ్రీకాంత్ ఫెయిలవ్వటంతో అతను అప్పుడే గ్రూప్‌వన్‌లో సెలక్టయి కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంటులో సి టి.వో గా జాయిన్ కావడం జరిగింది.

నేను సరిగ్గా వోరల్ ఎగ్జామ్స్‌కి ఢిల్లీ వెళ్ళినప్పుడే శ్రీకాంత్ పెళ్ళికూడా జరిగిపోయింది నేను ఢిల్లీనుంచి తిరిగి వచ్చేసరికి శ్రీకాంత్ భార్యతో హనీమూన్ వెళ్ళాడని తెలిసి చాల నిరుత్సాహపడ్డాను నేను! తిరిగి నేను డెహరాడూన్ ట్రెయినింగ్‌కి వెళ్ళిపోవటంతో అతన్ని కలిసే అవకాశమే దొరకలేదు నాకు! అతని వివాహమంతా నాచేతుల మీదుగా జరుగుతుందనుకొన్న నాకు, ఆ అవకాశం లేకపోవడమేగాక యింతవరకూ ఆ భార్యాభర్తలకి శుభాకాంక్షలు చెప్పే సందర్భం కూడా దొరకలేదు.

ట్రెయినింగ్ పూర్తయి పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకున్న నేను మొట్టమొదట వాణ్ణికలవాలని నిర్ణయించుకుని వాడిఎడ్రస్ తెలుసుకుని ఎంతో ఉత్సాహంతో రైలు దిగితే.... రోగ్! ఏదో కాన్ఫరెన్స్ అంటూ నన్ను దగాచేసేడు!

వెయిటర్ తెచ్చిన ఆటో ఎక్కి బయల్దేరేను! వాళ్ళ వీధి దగ్గరవుతోంటే ఏదో నెర్వస్‌నెస్!

ఫోనులో అంత చిలిపిగా మాట్లాడిన ఆమె రూపం ఎలా వుంటుందో!

ఆమెను ఇంకొన్ని క్షణాల్లో చూడబోతున్నానంటే ఏదో థ్రిల్!

ఛ! ఏమిటీ మనసు కోతిలా ప్రవర్తిస్తోంది!

ఆమె నాస్నేహితుడి భార్య!

ఆమెపట్ల.... ఇలా ఆసక్తి చూపించడం చాల తప్పు!


అంతరాత్మ హెచ్చరికలకి మనసు తాత్కాలికంగా లొంగినట్లు కన్పిస్తోన్నదాని ఆలోచనలది నిరభ్యంతరంగా చేస్తోంది!

మీటర్ రీడింగ్ పేచేసి గేటు తీసుకుని మెల్లగా లోనికి నడిచేను! గ్రిల్స్ వున్న హాలు తలుపులు మూసివున్నాయి!

కుడివేపు గోడకున్న నేమ్‌ప్లేటు మీద రవీంద్ర పేరు పెయింటు చేయబడి నేను సరిగ్గానే చేరుకున్నాననే విషయం తెలియజేస్తోంది.

గ్రిల్స్‌లోంచి గుమ్మానికి కట్టిన గులాబీరంగు పర్దామీద పెయింటు చేసిన అందమైన క్రిమ్సన్ కలర్ రోజాపూలు పరిమళాన్ని మరచి ప్రాణం పోసుకున్నట్లు అందంగా వున్నాయి.

మెల్లగా ధైర్యం తెచ్చుకుని కాలింగ్ బెల్ మీద చేయి పెట్టేను....నొక్కీనొక్కనట్లుగా.




"కమింగ్!" ఆమె గొంతు తియ్యగా ధ్వనించింది.

ఆ వెంటనే సన్నగా గాజుల చప్పుడు.

ఆమెని చూడటానికి మనసు ఉరకలు వేస్తోంది!

ఆమె తలుపు తీసి "రండి!" అంది చిరునవ్వుతో.

లావూ సన్నం కాని శరీరాకృతితో, తెలుపూ నలుపూ కాని శరీర వర్ణంతో జారు ముడితో, వంట చేయడం వల్ల పట్టిన చిరుచెమటతో, వెంకటగిరి చీరతో చాల సాదాగా వుందామె.

ఆమెనలాగే చూడటం భావ్యం కాదని చూపు మరల్చుకొని హాల్లోకి వచ్చేను

ఆమె పని మనిషిని పిలిచి నా లగేజ్ లోపల పెట్టించింది.

"డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుంటారా గెస్ట్‌రూమ్‌లోకి వెళ్ళిరెస్ట్ తీసుకుంటారా?" అడిగిందామె నవ్వుతూ.

"డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుంటాను!" అన్నాను.

"రండి!" ఆమెను అనుసరించేను.

ఆమె టేప్ ఆన్ చేసింది. చిట్టిబాబు వీణ చిరుగాలిలో కలిసి చెవుల్లో దూరి మనసుని గిలిగింత పెడుతోంది!

"ఈ మాగజైన్సు చూస్తుండండి!" అంటూ కొన్ని వార, మాస పత్రికలు నా ముందున్న టీపాయ్ మీద వుంచివెళ్ళింది.

వెళ్తోన్న ఆమె వేపే తదేకంగా చూసేను!

ఆమె నెక్కడో చూసిన అనుభూతి!

నిజంగా చూశానోలేదో!

ఆలోచిస్తూ చేతిలోని మాగజైను తిప్పుతూ కూర్చున్నాను.

మరో పది నిముషాల్లో వేడివేడి పెసరట్లు - మంచినీళ్ళు తీసుకొచ్చింది.

"మీరు టిఫిన్ చేస్తూండండి నేనువెళ్ళి కాఫీ తెస్తాను!" అంటూ ఆత్మీయంగా చెప్పి వెళ్ళిందామె.

నాకేదో సంకోచంగా వున్నా పెసరట్ల మీదవున్న ప్రీతి దాన్ని వెనక్కి పారద్రోలింది.

"ఆమె వంట అద్భుతం!" అనిపించింది నాకు పెసరట్టు ఉస్తుచేయగానే.

"రవీంద్ర లక్కీఫెలో!" అనుకుంటూ టిఫిన్ లాగించేసేను.

ఆమె చేలో రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చి ఒక కప్పు నాకిచ్చి - మరో కప్పు తను తీసుకుని నా ఎదురు సోఫాలో కూర్చుంది.

"థాంక్స్!" అంటూ కప్పు అందుకున్నాను.

"మీరు మా యింట్లో రెండు రోజులుంటారు. ఇలా ప్రతి చిన్నదానికి థాంక్సు చెప్పడం మొదలెడితే చాలకష్టం. మీకు సర్వ్‌చేయడం - మీ స్నేహితుడి భార్యగా నా ధర్మం ! కాదంటారా?" అందామె నవ్వుతూ.

నేనుకూడా నవ్వేను.

నవ్వుతూనే ఆమె గురించి ఆలోచిస్తున్నాను.

ఆమె మాట్లాడే తీరులో, నవ్వులో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణగోచరిస్తోంది.

మగవారితో ఫ్రీగా మాట్లాడుతూనే. చనువుగా వ్యవహరిస్తూనే - తమ పరిధిలో తాముంటూ - అవతల వారిని అంత దూరంలో వుంచగల నేర్పు చాలమంది స్త్రీలలో అరుదుగా వుంటుంది.

మగవారితో మాట్లాడితే తమ నెక్కడ తక్కువగా అంచనా వేస్తారనే భయంతో ముడుచుకుపోయినట్లు ప్రవర్తించే ఆడవాళ్ళ గురించి నాకు బాగా తెలుసు!

ఈమెది విచిత్ర ప్రవృత్తి!

మొదటిసారి పరిచయంలోనే - భర్త లేకపోయినా నిర్భీతిగా, నిస్సంకోచంగా ప్రవర్తిస్తున్న ఆమెతీరు అభినందనీయం" అనుకున్నాను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగిందామె.

"ఏం లేదు!" అన్నాను తడబాటుగా.

"రవీంద్ర లేకపోవడం - మీకు అదోలా వుందికదూ!"

"అబ్బే! అదేం లేదు!"

"మీరు దాస్తున్నా- ఆ విజాన్ని మీ ముఖమే చెబుతోంది. నేను మీలా ఐ.ఎ.ఎస్. కాకపోయినా-మా కాలేజీలో నాకూ తెలివైనదనే పేరుంది!" అందామె పరదాగా నవ్వుతూ.

"మీరేం చదువుకున్నారు?" ఆమెతో మాటలు పెంచడానికి అవకాశందొరికింది.

ఎమ్. ఏ. ఇంగ్లీషు లిటరేచర్, గోల్డు మెడలిస్టుని!" అందామె గర్వంగా మెడ నిక్కబొడిచి.

"మీ పేరు తెలుసుకోవచ్చా?"

"తప్పకుండా! నా పేరు అజ్ఞ!"

నేను తృళ్ళిపడినట్లు ఆమె వేపు చూసేను.

ఆమె లేచి నిలబడిందినవ్వుతూ "పేరు చాలా విచిత్రంగా వుందికదూ!"

నేను ఆమెతో పాటూ నవ్వలేకపోయేను.

నా ఆలోచనలు ఎక్కడెక్కడో!

మనస్సు గబగబా పుటల్ని వెనక్కి తిప్పుతోంది!

"ఇక్కడ మనోజ్ఞ[ఇంగ్లీషు లిట్)అని వుంది!" అడిగేను అనుమానంగా ఒక పుస్తకం చూపిస్తూ.

ఆమె సున్నితంగానవ్వి "ఆ పుస్తకం నా ఫ్రెండుది! అందర్నీ ఆజ్ఞాపిస్తూ దర్జాగా బ్రతకాలని మానాన్నగారు నాకలా

పెట్టేరు!" అంది.

ఈ మాటలు యిదివరకే విన్నవి! ఎప్పుడు? ఎక్కడ? అంతుబట్టటం లేదు నాకు.

ఆమె నవ్వింది సితారా మీటినట్లు!

"ఆడవాళ్ళతో మాట్లాడటం-మీకు అలవాటు లేనట్లుంది! మిమ్మల్ని యిబ్బంది పెట్టను! మరో పదినిమిషాల్లో రవీంద్ర రావొచ్చు! కాస్త వంట మిగిలిపోయింది. ఈలోపున మీరు రెస్టు తీసుకోండి!" ఆ మాటలు నా మతిమరపుమీద కొరడా కొట్టినట్లుగా పనిచేసేయి!

నాకు వెంటనే స్ఫురించింది.

సంవత్సరన్నర క్రితం-

ఢిల్లీ ఓరల్ ఇంటర్వ్యూకిబయల్దేరేను.

ఐ. ఏ. ఎస్. ఎంట్రన్స్, రిటెన్ పాసయి ఓరల్‌దాకా నిలబడ గల్గటం నాకు అంతులేని వుత్సాహాన్ని కల్గచేస్తోంది. దాదాపు నా జీవిత ధ్యేయం సాధించినట్టే వనిపిస్తోంది నాకు. ఓరల్ కూడా సెలెక్టవుతావనే నమ్మకం కల్గుతోంది.

భవిష్యత్తుపై ఎన్నో ఆశలు! ఏవేవో వూహలు!

నాతో తెచ్చుకొన్న జనరల్ నాలెడ్జి పుస్తకాల మీద దృష్టి నిలవటం లేదు!

"ఎక్స్‌క్యూజ్‌మీ!" సన్నని కంఠం నన్ను ఆలోచనా వాహిన్నుంచి బయట పడేసింది.

ఆమె వైపు చూసేను!

విశాలమైన పెద్దకళ్ళకి వర్దాలాంటి కనురెప్పలు! చిరునవ్వు ముఖం. అందమైన శరీరాకృతికి అందంగా అంటిపెట్టుకున్న ఆర్గండీ చీర! వయ్యారమైన వంపుల మీద బరువుగా, పొడవుగా వూగుతోన్న జడ! చేతిలో పర్స్! మరో చేతిలో సూట్ కేస్!

నేను ఆమెవేపు నిశితంగా చూస్తోంటే. ఆమె "సీట్ నెంబర్ సెవెన్ యీజ్ మైన్" అంది.

"సారీ! ఈ సీట్లో ఎవరూ లేకపోవదంతో నేను కూర్చున్నాను. మీ కభ్యంతరం లేక పోతే నెంబర్ నైన్‌లో. కూర్చోండి. అది నాదే!" అన్నాను.

ఆమె కనుబొమ్మలు అయిష్టంగా ముడుచుకున్నాయి.

"ఎవరి సీట్లోవాళ్ళు కూర్చోవడం.... బాగుంటుంది కదూ!" అంది కొంచెం కరకుగా.

"అలా అని కాదు! విండో దగ్గర సీట్ అంటే.... నాకు లైకింగ్!" అన్నాను ఆమెని కన్విన్స్ చేయాలనే ధోరణిలో.

"అయ్ ఆల్సో ప్రిఫర్ దట్! అందుకే నేను కావాలని రిజర్వు చేయించుకున్నాను!" అందామె చాలా మొండిగా.

నాకు లేపక తప్పలేదు.

ఆమె దర్జాగా సీటు ఆక్రమించుకొని తనతో తెచ్చుకొన్న ఇంగ్లీషు నవలా పఠనంలో నిమగ్నమయ్యింది.


నాకు కచ్చిగా వుంది. నవల చదువుకోటానికి విండో పక్కనే సీటు కావాలి కాబోలు! అని పళ్ళు నూరుకున్నాను.

నా పక్క విండో దగ్గర కూర్చున్నాయన ఖంగున దగ్గుతూ ఎదురు సీట్లో అటుపక్కగా కూర్చున్న వ్యక్తితో రాజకీయాలగురించి మాట్లాడుతున్నాడు. అవతల తను అయిష్టంగా ఆవులిస్తూ వింటున్నాడు.

నాకూ.... బోరెత్తి 'కాంపిటీటివ్ సక్సెస్' మీద పడ్డాను. గంట గడిచింది.

నా పక్కన దగ్గుల కంపెనీ .... ఎదురుగావున్న ఆవులింతల ఖని ఏదో స్టేషన్‌లో దిగిపోయేరు.

ఎదురు బెర్తుమీద ఆమె — నేను మిగిలేం!




అది అన్ సీజన్ కావడంవల్ల రద్దీ అంతలేదు!

నేనుకూడా విజయగర్వంతో విండో పక్క సీట్లోకి జరిగేను! అలా జరుగుతున్నప్పుడు ఆవిడ పుస్తకంలోంచి లోంచి తలెత్తి నావైపు అదోలా చూసి మళ్ళీ పుస్తకంలో దూరిపోయింది.

"ఒరేయ్ మానర్‌లెస్ బగ్! ఎప్పుడూ ఇతర్ల సీట్లమీదఎక్రోచ్‌మెంటేనా?" అన్నట్లుందా చూపు.

చాలా సీరియస్ టైపులా వుంది!

నాకామెతో మాట్లాడాలనిపిస్తోంది!

నేను ఐ. ఏ. ఎస్. రిటెన్ పాసయ్యేనని తెలిస్తే అలా బిహేవ్ చేస్తుందా?

ట్రైచేసి ఆమెని మాటల్లో దించాలనుకున్నాను.

అందుకు నాందిగా పొడిగా దగ్గి- "ఎక్కడిదాకా వెళ్తున్నారు?" అంటూ చాల మర్యాదగా అడిగేను.

ఆమె చుట్టూ చూసి తననే అడిగేనని గ్రహించి "ఖాజీపేట్!" అంది పొడిగా.

"చదువుకుంటున్నారా?"

ఆమె నావేపు చురుగ్గా చూసి "ఎం.ఏ. ఇంగ్లీషు లిట్. గోల్డు మెడలిస్టు ఆంధ్ర యూనివర్శిటీ" అంది.

"కంగ్రాట్స్! మే అయ్ నో యువర్ నేమ్ ప్లీజ్!" అన్నాను చిరునవ్వు ముఖానికి పులుముకుని పట్టువదలని విక్రమార్కుడిలా!

ఆమె నావేపు సీరియస్‌గాచూసి "అజ్ఞ" అంది.

"వెరీ పెక్యూలియర్ నేమ్"అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

ఇంకెలా ఆమెతో మాటలు పెంచాలో తెలియటం లేదు నాకు! ఆడపిల్లల్ని ఆటపట్టించడంలో ప్రథమబహుమతిపొందిన నాకు ఈ అమ్మాయి మెంటాలిటీ అంతుపట్టడంలేదు!

ఖాజీపేట దగ్గరకొస్తోంది మరో అరగంటలో. ఈమెనెలా కదిలించాలి!

ఇంతలో ఆమె బాత్‌రూమ్‌కి వెళ్ళింది.

వెంటనే నాకు మెరుపులాంటిఆలోచన వచ్చింది. గబుక్కున ఆమె చదువుతోన్న పుస్తకం తీసుకుని వెనుక అట్ట లోపలి భాగంలో నా అడ్రస్ రాసి. అయ్‌లైక్‌యు మే అయ్ ఎక్స్‌పెక్టు ఎ లెటర్ ఫ్రమ్

యు" అంటూ రాసి యథాస్థానంలో పెట్టేసేను.

ఆమె తిరిగివచ్చి కూర్చుంది.

'మీ స్టేషన్ వచ్చేస్తుంది నాకింకబోర్' అన్నాను.

ఆమె నావేపుచూసి "ఎక్కడికి వెళ్తున్నారు?" అంది.

'ఢిల్లీ!' అంటూ గబగబా నా స్వంత డబ్బా వాయించేసేను.

ఆమె చిరునవ్వు నవ్వింది.

'హమ్మయ్య ఈపని ఇందాకేచేసుంటే బాగుండేది 'అనుకుంటూ మీపేరు చాల తమాషాగా వుంది' అన్నాను తిరిగి.

"అందరినీ ఆజ్ఞాపిస్తూ దర్జాగా బ్రతకాలని మా నాన్నగారు పెట్టేరు!" అంది నవల పర్సులో పెట్టుకుంటూ.

"మీరు ఇందాక మాట్లాడినతీరుచూస్తే చాల సీరియస్ టైపనుకున్నాను. మగవారితో మాట్లాడటం యిష్టం వుండదనిపించింది" అన్నాను.

"కోరి కష్టాలు తెచ్చుకోవడం యిష్టం లేక!" అందామె.

అప్పుడప్పుడే నోరువిప్పి ఆమెమాట్లాడటం మొదలెట్టిందో లేదో- రైలు నిర్దయగా ఖాజీపేట్ రైల్వేస్టేషన్‌లో తక్కున ఆగింది.

ఆమె దిగి వెళ్ళిపోయింది. దిగి కిటికీ దగ్గరగా వచ్చి నావైపుచూసి 'ఆల్‌దబెస్ట్' అనడం నా చెవులకి వినిపించింది.

కనిపించనంత సేపూ ఆమెని చూసి నిరాశగా నిట్టూర్చేను. ఆమె నుంచి తప్పకుండా లెటర్ వస్తుందని ఏదో ఆశ!


ఇంతలో నేను ఓరల్‌లో సక్సెస్ కావడం.... ట్రెయినింగ్.... ఆమెని దాదాపు మరచిపోయేను.

తిరిగి....ఆమె....రవీంద్ర భార్యగా చాల చనువుగా మాట్లాడుతూ.... తటస్థపడటం.... నాకెంతో విచిత్రాతి విచిత్రంగా.... వుంది

ఆమె నన్ను గుర్తుపట్ట లేదేమో!

గుర్తుపడితే అంత ఫ్రీగా బిహేవ్ చేయగలదా?

"హాయ్! కంగ్రాట్స్‌రా!" అంటూ రవీంద్ర వచ్చి సుడిగాలిలా నన్ను చుట్టేసి ప్రశ్నల వర్షం కురిపిస్తోంటే ఈ లోకం లోకి వచ్చిపడ్డాను



ఇంతలో ఆమెకూడావచ్చి నిలబడింది.

ఆమెను చూస్తే నాలో ఏదో జంకుగా వుంది. ఆమె గబుక్కున గుర్తుపట్టేస్తే నా గురించి రవీంద్రకి చెబుతుందేమో!

వాళ్ళిద్దరూ నన్ను ఊరంతా తిప్పినా.. భోజనాల దగ్గర జోక్స్ కట్ చేసినా ఫ్రీగా బిహేవ్ చెయ్యలేకపోతున్నాను.

"ఏరా అప్పుడే ఐ. ఏ. ఎస్. ఫోజు కొడ్తున్నావా?" అన్నాడు రవీంద్ర నన్ను మోచేత్తో పొడుస్తూ.

ఆమె నవ్వింది.

నేను సిగ్గుగా నవ్వేను.

* * *

ఆ రోజు ప్రయాణానికి సిద్ధం అవుతున్నాను.

ఆమెకి ఆ సంఘటన గుర్తు చేయాలనిపిస్తోంది. కాని రవీంద్ర క్షణం కూడా నన్ను ఒంటరిగా వదలటం లేదు. ఆమె నవలలో నేను వ్రాసిన అడ్రస్ అసలు చూసిందో లేదో!

'ఇదిగోరా నీ డైరీ!' అంటూ సోఫా మీదవున్న డైరీ అందించేడురవీంద్ర.

వాళ్ళిద్దరూ.... స్టేషన్ దాకా వచ్చేరు.

ట్రెయిన్ కదులుతుండగా ఆమె "ఈ నవల మీరు చదవలేదని....కావాలని అడిగేరుగా! తీసుకోండి!" అంటూ ఒక పుస్తకం అందించింది.

నేను నివ్వెరపోయేను. నేనసలు ఆమెను ఏ నవలా అడగలేదు.

సందిగ్ధంగా చూస్తోన్న నా చేతిలో రవీంద్ర ఆమె చేతిలోని నవల తీసుకుని వుంచి "విష్ యూ హేపీ జర్నీ!" అన్నాడు నవ్వుతూ.

ఆమె చెయ్యి గాలిలోకి లేచింది.

వాళ్ళిద్దరూ కనుమరుగయ్యేక బెర్త్ మీద కూర్చుని గబగబా నవల పేజీలు తిప్పేను.

మధ్యలో వున్న ఒకస్లిప్ మీదపడింది నా దృష్టి!

డియర్ ఫ్రెండ్.

మిమ్మల్ని గుర్తు పట్టేను. ఇప్పుడు కాదు. పెళ్ళయిన క్రొత్తలోనే రవీంద్ర 'నా ఫ్రెండ్' అంటూ మీ ఫొటో చూపించి గొప్పగా చెప్పేరు. నేను ట్రెయిన్ ఇన్సిడెంట్ చెబితే ఆయన కూడా నవ్వేరు. మీరు నవలలో రాసిన అడ్రస్ చూసి నవ్వుకున్నాను. ఎందుకో కోపం రాలేదు. లెటర్ కూడా వ్రాద్దామనిపించింది. ఇంతలో నా మారేజ్ సెటిలయ్యింది. మీతో ఫ్రెండ్‌షిప్ అంత మంచిది కాదేమోనని ఊరుకున్నాను. మీరు వస్తున్నారంటే మీకు సర్‌ప్రయిజ్ యిద్దామని రవీంద్ర-నేను కలిసి ఇలా చేసే! సరదాగా తీసుకోండి. నా పేరు మనోజ్ఞ!ఆజ్ఞ కాదు! మీతో ఆనాటి నేస్తం ఏనాటికి మరచిపోలేనిది! మల్లెపూలకి; మంచి గంధానికి పరిమళం వున్నన్ని రోజులూ మన మధ్య స్నేహంవుంటుంది ఆల్‌దబెస్ట్! -మనోజ్ఞ.

బెడ్ మీద వున్న ఈ నవలని యధాలాపంగా పేజీలు తిప్పుతోన్న నాకు ఈ లెటర్ కనిపించింది. మనోజ్ఞ చాలా తమాషా మనిషి. తను గమ్మత్తు చేస్తానంటే....సరేనన్నాను! ఆనాటి మీ చెలిమిని నేను కలగా తీసుకుంటున్నాను. మన ముగ్గురి స్నేహం ఇలాగే వుండాలని ఆశిస్తూ -నీ రవి.

ఉత్తరం చదివి వాళ్ళ స్పోర్టివ్‌మెంటాలిటీకి మనస్ఫూర్తిగా నవ్వుకున్నాను.

మనసు తేలికపడి మళ్ళీ ఉత్సాహం పుంజుకుంది